సాక్షి నల్లగొండ

మంగళవారం । 28 । నవంబర్ । 2023



ఎన్నికలకు 331 బస్సులు

ఎన్నికల సామగ్రి, సిబ్బందిని తరలించేందుకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 331 ఆర్టీసీ బస్సులను సమకూర్చారు. - 6లో



చెర్వుగట్టుకు పోటెత్తిన భక్తజనం

కార్తీక పౌర్ణమి సందర్భంగా చెర్వుగట్టులోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. - 6లో



బహుజన బిడ్డను గెలిపించాలి

నల్లగొండ బరిలో ఉన్న బహుజన బిడ్డ శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపించాలని కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే అన్నారు. - 6లో

న్యూస్‌రీల్

ఎన్జీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

రామగిరి(నల్లగొండ): ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా సోమవారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో ఎన్‌సీసీ, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎన్‌సీసీ క్యాడెట్లు పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ చిలుముల సుధాకర్, లైబ్రేరియన్ డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్, పీడీ కడారి మల్లేశం, రెడ్‌క్రాస్ సభ్యుడు మందడి సైదిరెడ్డి, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటేయండి



సమావేశంలో పాల్గొన్న పోలీస్ అబ్జర్వర్లు, ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: ఈ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఇందుకు శాంతిభద్రతల పరంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు కేంద్ర ఎన్నికల స్పెషల్ పోలీస్ అబ్జర్వర్లు విజయ్‌సింగ్ మీనా, వినీత్‌ఖన్నా, జిల్లా ఎస్పీ అపూర్వరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కేంద్ర పారా మిలటరీ బలగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల దూరంలోల వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా బలగాలకు పలు సూచనలు చేశారు. జిల్లాలో చేసిన ఎన్నికల ఏర్పాట్లను ఎస్పీ అపూర్వరావు వివరించారు.

నేడు మాదిగల సమరభేరి సభ

చండూరు: చండూరు మండలం బంగారుగడ్డ గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే మాదిగల సమరభేరి బహిరంగ సభకు ఆ సంఘం నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారుగా 17వేల జనాభాకు సరిపోయే విధంగా సభ ప్రాంగణం సిద్ధం చేశారు. మధ్యాహ్నం 2గంటల జరగనున్న ఈ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నారు. ఈ సభకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి భారీగా జనాన్ని సమీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆ సంఘం మండల అధ్యక్షుడు ప్రసాద్ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన శాలిగౌరారం జెడ్పీటీసీ



రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న జెడ్పీటీసీ ఎర్ర రణీల

శాలిగౌరారం: శాలిగౌరారం జెడ్పీటీసీ ఎర్ర రణీల, చిత్తలూరు సర్పంచ్ మామిడికాయల జయమ్మ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో సోమవారం మునుగోడులో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం వారు నల్లగొండలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిశారు. వారితోపాటు వార్డు సభ్యుడు వంగూరి రవి, మాజీ వార్డు సభ్యుడు ఎర్ర సైదులు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎర్ర మహేశ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మదారుద్దీన్, బాకి ఉపేందర్, సాయిలోకేష్, బండారు శివప్రకాశ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

గెలుపు దక్కేదెవరికి?

కొన్ని చోట్ల నువ్వా నేనా.. మరికొన్ని చోట్ల త్రిముఖ పోటీ

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్‌కు గడువు దగ్గరపడింది. 30న ఉదయం నుంచే పోలింగ్ జరగనుండగా.. అభ్యర్థుల పోల్ మేనేజ్‌మెంట్‌కు సమయం రెండు రోజులు ఉంది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగియనుంది. 29వ తేదీన కూడా సభలు సమావేశాలు మినహా ఇంటింటి ప్రచారం చేసుకునే వీలు ఉంది. అయితే ఇప్పటివరకు నిర్వహించిన ప్రచారం ఆధారంగా ఇంకా తాము ఏయే పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో బలహీనంగా ఉన్నామో తెలుసుకొని పార్టీ శ్రేణులను రంగంలోకి దింపాయి. కొన్ని చోట్ల నువ్వా నేనా అన్నట్లుగా, మరికొన్ని చోట్ల త్రిముఖ పోటీ ఉంది.

–సాక్షి ప్రతినిధి, నల్లగొండ

- పోల్ మేనేజ్‌మెంట్‌కు రెండు రోజులే గడువు
- వ్యూహ, ప్రతివ్యూహాల్లో అభ్యర్థులు
- పార్టీ శ్రేణులు ప్రతీ ఓటరును కలిసేలా ప్రణాళిక



నల్లగొండ జిల్లాలో మూడింట సై అంటే సై

- నల్లగొండ నియోజకవర్గంలో ఇద్దరి మధ్యే పోటీ నెలకొంది. ఇక్కడ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులైన కంచర్ల భూపాల్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మధ్యే కీలక పోరు సాగుతోంది. బీజేపీ నుంచి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ నుంచి పిల్లి రామరాజుయాదవ్ బరిలో ఉన్నారు. ఇక్కడ బీజేపీ సంప్రదాయ ఓట్లు బీజేపీకే పడనుండగా, ఆయన అదనంగా ఏ మేరకు ఓట్లను సాధిస్తారన్నది పోలింగ్ రోజే తేలనుంది. మరోవైపు పిల్లి రామరాజుయాదవ్ యాదవ సామాజికవర్గంతోపాటు బీసీల ఓట్లు తనకు పడేలా ప్రయత్నిస్తున్నారు. ఈయన చీల్చే ఓట్లు.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపోటముల్లో ప్రధానం కానున్నాయి.
- నకిరేకల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం మధ్య హోరాహోరీగా పోటీ సాగుతోంది. ఇక్కడ చేసిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ అభ్యర్థి ధీమాగా ఉండగా, కాంగ్రెస్ పార్టీకి ఉన్న జోష్, మాజీ ఎమ్మెల్యేగా తనకున్న వ్యక్తిగత అనుచర వర్గ బలంతో గెలుపు సాధిస్తానన్న ధీమాతో కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నారు.
- నాగార్జునసాగర్‌లోనూ ఇద్దరి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కేడర్, తన తండ్రి జానారెడ్డి చరిష్మా తనను కచ్చితంగా గెలిపిస్తుందన్న ధీమాలో ఉన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్ నియోజవర్గ అభివృద్ధికి తాను తీసుకుకొచ్చిన నిధులు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలే తనను గెలిపిస్తాయనే నమ్మకంతో ఉన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ బీజేపీ, ఇతర పార్టీలు భారీ ప్రభావం చూపుతాయన్న అంచనాలు లేవు.

మిర్యాలగూడ, మునుగోడు, దేవరకొండలో ట్రయాంగిల్

- మిర్యాలగూడలో బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వ్యక్తిగతంగా తమకున్న పట్టుతో గెలుస్తానని భావిస్తుండగా, కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి కూడా తన వ్యక్తిగత చరిష్మా, పార్టీ వేవ్ పైనే ఆధార పడ్డారు. ఇదే నియోజకవర్గం నుంచి మూడుసార్లు గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే, సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి తన వ్యక్తిగత చరిష్మాతోపాటు పార్టీకి ఉన్న బలంతో గెలుస్తానన్న ధీమాలో ఉన్నారు.
- మునుగోడులో బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి మధ్య పోరు నెలకొంది. ఉప ఎన్నికల తరువాత సీఎం ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో చేపట్టిన చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలే తనను గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ అభ్యర్థి భావిస్తుండగా, నియోజకవర్గంలో తనకున్న వ్యక్తిగత చరిష్మా, కాంగ్రెస్ పార్టీకి ఉన్న క్రేజ్ తనను గెలిపిస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి భావిస్తున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి కూడా గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. బీజేపీ సంప్రదాయ ఓట్లతోపాటు ఆయన చీల్చే ఇతర ఓట్లే ఈ ఎన్నికల్లో అక్కడ ప్రధానం కాబోతున్నాయి.
- దేవరకొండలో కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్, బీఆర్‌ఎస్ అభ్యర్థి రవీంద్రకుమార్ మధ్య ప్రధాన పోటీ ఉండగా, బీజేపీ అభ్యర్థి కేతావత్ లాలూ నాయక్ గట్టి పోటీ ఇస్తున్నారు. ఆయన నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు.

యాదాద్రిలో ముక్కోణం

- భువనగిరి నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. భువనగిరిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి తాను చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపైనే ఆశ పెట్టుకోగా, కాంగ్రెస్ పార్టీ నుంచి కుంభం అనిల్ కుమార్‌రెడ్డి తమ పార్టీకి ఉన్న వేవ్ పైనే ఆశ పెట్టుకున్నారు. ఇక బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళుతూ గెలుపొందాలని భావిస్తున్నారు.
- ఆలేరు నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి నెలకొంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే గత పదేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తనను మూడో సారి గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య.. పార్టీ జోష్, ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందని భావిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్ కూడా ప్రభుత్వ వ్యతిరేకతతోపాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు.

రెండు చోట్ల ద్విముఖం.. మరో రెండు చోట్ల త్రిముఖం

- సూర్యాపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. సూర్యాపేటను జిల్లాగా తీర్చిదిద్దడం, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తనను గెలిపిస్తాయన్న ధీమాలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మాజీ మంత్రిగా, ఎమ్మెల్యేగా గతంలో పనిచేసిన తీరు, గత ఎన్నికల్లో ఓడిపోయారన్న సానుభూతి, కాంగ్రెస్ పార్టీకి ఉన్న క్రేజ్ తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు ఈసారి గెలుస్తానన్న ధీమాలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు తనను గెలిపిస్తాయని భావిస్తున్నారు. బీఎస్పీ అభ్యర్థి జానయ్య యాదవ్ పోటీలో ఉన్నా ఎంతమేరకు బీఆర్‌ఎస్ ఓట్లను చీల్చుతారన్నది ఆసక్తిగా మారింది.
- హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఉన్న వ్యక్తిగత చరిష్మా, పార్టీ జోష్ తనను గెలిపిస్తుందని భావిస్తుండగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తనను గెలిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు.
- కోదాడలోనూ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి గతంలో ఓడిపోయారన్న సానుభూతి, కాంగ్రెస్ పార్టీ జోష్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఉన్న చరిష్మా తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే పూర్తిగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపైనే ఆశ పెట్టుకున్నారు.
- తుంగతుర్తిలోనూ త్రిముఖ పోటీ నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ గత పదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయన్న ధీమాతో ఉన్నారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మందుల సామేల్ తనకున్న పేరు, పార్టీ క్రేజ్ తనను గెలిపిస్తుందని భావిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, కేంద్ర పథకాలను తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు.

● కార్తీక దీపోత్సవం



కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం నల్లగొండలోని బీట్ మార్కెట్ వద్ద రామకోటి స్థూప దేవాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కమ్యూనిస్టులను చట్టసభలకు పంపాలి

- మిర్యాలగూడలో రంగారెడ్డి గెలుపు అనివార్యం
- రోడ్‌షోలో సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి



రోడ్‌షోలో అభివాదం చేస్తున్న సీతారాం ఏచూరి, జూలకంటి రంగారెడ్డి, సాగర్ తదితరులు

మిర్యాలగూడ : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపి పోరాట వారసత్వాని నిలబెట్టాలని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి గెలుపును కాంక్షిస్తూ సోమవారం మిర్యాలగూడ పట్టణంలో హనుమాన్‌పేట ఫ్లెటోవర్ బ్రిడ్జి నుంచి వేలాది మందితో రాజీవ్‌చౌక్ వరకు భారీ ర్యాలీ ద్వారా రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌చౌక్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు లేని చట్టసభల్లో ప్రజా సమస్యలపై ప్రశ్నించే నాయకులే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్యాలగూడలో జూలకంటి రంగారెడ్డి గెలుపు అనివార్యమని, ప్రజలంతా ఆలోచించి రంగారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ తన గెలుపు రాష్ట్ర రాజకీయాలకు కీలక మలుపుగా మారుతుందన్నారు. పదవులున్నా, లేకున్నా పేదల కోసం పనిచేస్తున్నానని, తనను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే మిర్యాలగూడ ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచుతానని అన్నారు. గతంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉందని, ఆనాడు మా పార్టీ అధికారంలో లేనప్పటికీ ప్రభుత్వాల మెడలు వంచి నియోజవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని చెప్పారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులు డబ్బును నమ్ముకుని ఓట్లు కొనుగోలు చేయాలని చూస్తున్నారని, తాను మాత్రం ప్రజలను నమ్ముకొని ఉన్నానని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు తీగల సాగర్, శ్రీరామ్‌నాయక్, రమా, ఎంవి.రమణ, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, జగదీశ్చంద్ర, పరుశురాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, వరలక్ష్మి, శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, రామ్మూర్తి, అయూబ్, అంజాద్, రొండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో నిర్వహించిన రోడ్ షోకు హాజరైన ప్రజలు

కేసీఆర్ పాలన అవినీతిమయం

- కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



తిప్పర్తి మండలం సర్వారంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: 'పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు.. కాళేశ్వరం ప్రాజెక్టు పేర కోట్ల రూపాయల అవినీతి జరిగింది.. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది.. కేసీఆర్‌కు చర్లపల్లి జైలులో డబుల్‌బెడ్ రూం ఇల్లు కట్టిస్తాం' అని నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి, స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ నియోజక వర్గంలోని మాడ్గులపల్లి, తిప్పర్తి మండలాల్లోని పలు గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది విద్యార్థులు ఆత్మ బలిదానాలు చేసుకుంటే ప్రత్యేక రాష్ట్రం వచ్చిందని, ఆ అమరుల త్యాగాలను కూడా కేసీఆర్ ఆగం చేశాడని ధ్వజమెత్తారు. ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షలన్నీ పేపర్ల లీకేజీల కారణంగా రద్దు కావడంతో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'పదేళ్ల కాలంలో ఇళ్లు కట్టిచ్చింది లేదు. ఒకరికి కొత్త రేషన్ కార్డు ఇచ్చింది లేదు. తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ కుటుంబానికే వచ్చింది తప్ప ప్రజలకు ఏం లాభం కలగలేదు' అని అన్నారు. 'నల్లగొండలోని ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయింది. అది పూర్తి చేస్తే నాకు పేరు వస్తుందన్న ఉద్దేశంతో పక్కనపెట్టారు' అని ఆరోపించారు. నియోజక వర్గంలో బీఆర్‌ఎస్ దొంగ నేతల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అంతా ధైర్యంగా ఉండాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసి తీరుతామని చెప్పారు.

సమయానికి ప్రచారం ముగించాలి

- నేటి సాయంత్రం 5గంటలకు పరిసమాప్తం కావాలి
- 29వ తేదీన ఇంటింటి ప్రచారానికి అనుమతి ఉంది
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి కర్ణన్, ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ: అసెంబ్లీ సాధారణ ఎన్నికల ప్రచార ప్రక్రియ మంగళవారం సాయంత్రం 5 గంటలకు ముగించాలని, ఆ తర్వాత ఏ ఒక్కరూ ఎలాంటి ప్రచారాలు, మైక్‌లు ఉపయోగించే అనుమతి లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అన్నారు. ఎస్పీ అపూర్వరావుతో కలిసి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచార ప్రక్రియ ముగుస్తున్నందున మంగళవారం నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

మొత్తం 1,766 పోలింగ్ కేంద్రాలు

ఈనెల 30వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్‌తోపాటు డిసెంబర్ 3న ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ జరగనున్నందున ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. మొత్తం 1,766 పోలింగ్ కేంద్రాలతోపాటు 1,271 లోకేషన్లు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 556 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లకు 336 లోకేషన్లు గుర్తించామని, అందులో 22 షాడో పోలింగ్ స్టేషన్లు, 21 లొకేషన్లను గుర్తించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు.

ఎన్నికల విధుల్లో 8,140 మంది సిబ్బంది

ఈ ఎన్నికల్లో పోలింగ్‌కు సంబంధించి మొత్తం 8,140 మంది అధికారులు, సిబ్బందిని నియమించామని కలెక్టర్ పేర్కొన్నారు. 378 క్రిటికల్, షాడో పోలింగ్ కేంద్రాల్లో 410 మంది మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో అవసరమైన వసతులు సమకూర్చామన్నారు. ఎన్నికలకు మొత్తం 3,079 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారని వారితోపాటు టీఎస్ఎస్పీ 3 ప్లాటూన్స్, సీపీఎఫ్ 19 కంపెనీస్ బందోబస్తు నిర్వహిస్తారన్నారు. ఆరు నియోజకవర్గాల్లో 180 రూట్, సెక్టోరియల్, పోలీస్ ఆఫీసర్లను నియమించామన్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో వెబ్‌కాస్టింగ్

ప్రతి నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ నిర్వహణ సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లాలో 2,440 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా అందులో 2,258 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. జిల్లాలో 180 రూట్లకు 142 ఆర్టీసీ బస్సులు, 181 స్కూల్ బస్సులు, 198 తుఫాన్ వాహనాలు, 18 మంది స్మాల్ కంటెయినర్లు, 12 బిగ్ కంటెయినర్లు, 1,034 ఆటోలతో కలిపి మొత్తం 1,585 వాహనాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఓటు వేసేందుకు వెళ్లే ప్రతి ఓటరూ ఓటరు స్లిప్‌తోపాటు 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదేని ఒకటి కచ్చితంగా పోలింగ్ స్టేషన్‌కు తీసుకెళ్తేనే అనుమతి ఉంటుందన్నారు. ఇప్పటికే వీటిపై అవగాహన కల్పించామన్నారు. ఇంకా 98 శాతం పోల్ స్లిప్పులను పంపిణీ చేశామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 14,64,080 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేమన్నారు.

ఆ ఒక్కరోజు ఇంటింటి ప్రచారం..

ఈనెల 29వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటా ప్రచారానికి ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఐదుగురికి మించకుండా ఇంటింటి ప్రచారం చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు : ఎస్పీ అపూర్వరావు

ఎస్పీ అపూర్వరావు మాట్లాడుతూ మంగళవారం ఎన్నికల ప్రచారం ముగుస్తున్నందున ఇతర ప్రాంతాల వారు జిల్లా నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అన్ని హోటళ్లు, ఫంక్షన్ హాళ్లను తనిఖీ చేస్తామని, ఎవరైనా ఇతర ప్రాంతాల వారు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైన్స్‌లు కూడా బంద్ అవుతాయని.. ఎక్కడైన మద్యం అమ్మితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లఘిస్తే 100 నంబర్‌కు కానీ, సీ-విజిల్‌కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ సెంటర్లలో పోలీస్ బందోబస్తు ఉంటుందని, పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను తీసుకొచ్చే వాహనాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎక్కడ కూడా ఐదుగురికి మించి గుమికూడ వద్దన్నారు.

రేపు ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తాం

- జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్
- అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ: ఈనెల 30వ జరగనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో 29వ తేదీ ఉదయం నుంచే సిబ్బందికి ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అన్నారు. సోమవారం నల్లగొండ కలెక్టర్‌లో ఆర్‌ఓలు, నోడల్ ఆఫీసర్లు, ఏఆర్వోలు, సెక్టార్ ఆఫీసర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఉన్నతాధికారులు జిల్లాల ఎన్నికల అధికారులతో హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్ కర్ణన్ హాజరై ఉన్నతాధికారుల సూచనలు విన్నారు. సమావేశంలో ఆర్‌ఓలు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, చెన్నయ్య, రవి, శ్రీరాములు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనల జారీకి అనుమతి తీసుకోవాలి

పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు అంటే ఈనెల 29, 30 తేదీల్లో దిన పత్రికల్లో రాజకీయ ప్రకటనల ప్రచురణకు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రచురణ తేదీకి రెండు రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సైకిల్‌ను ఢీకొట్టిన బైక్.. బాలుడి దుర్మరణం


రాకేష్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: సైకిల్‌పై రోడ్డు దాటుతున్న బాలుడిని బైక్ ఢీకొట్టడంతో మృతిచెందాడు. మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా.. అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం గ్రామంగాంధీనగర్‌కు చెందిన రమావత్ జాను కుటుంబ సభ్యులు కొంతకాలంగా మిర్యాలగూడలోని హనుమాన్‌పేటలో నివాసిస్తున్నారు. ఆదివారం రాత్రి జాను కుమారుడు రాకేష్(12) తన పెదనాన్న కుమారుడు సిద్ధు కలిసి సైకిల్‌పై సాగర్ రోడ్డు దాటుతుండగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన నాంపల్లి సాయికిరణ్ బైక్‌పై హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాకేష్ తీవ్ర, సిద్ధుకు స్వల్ప గాయాలయ్యాయి. రాకేష్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన సాయికిరణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి జాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఆలిండియా జమాత్ ఉల్మా మద్దతు


మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

నల్లగొండ: ఆలిండియా జమాత్ ఉల్మా నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు పీసీసీ అధికార ప్రతినిధి, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ హఫీజ్‌ఖాన్, బషీరుద్దీన్, అమీన్‌బాబా, పీసీసీ సభ్యులు ఇంతియాజ్, మహ్మద్ మసూద్ అలీ, ఖాజా మెయినుద్దీన్, జహీర్ అలీఖాన్‌లు తెలిపారు. సోమవారం నల్లగొండలోని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

నేడు జనరల్ బాడీ సమావేశం

నల్లగొండలోని మిర్యాలగూడ రోడ్డులో గల ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం ముస్లిం మైనార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు ముస్లిం మైనార్టీ నాయకులు తెలిపారు. ఈ సమావేశానికి ఆలిండియా మైనార్టీ ప్రెసిడెంట్, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్ ప్రతాప్ హాజరవుతారని పేర్కొన్నారు.

మాలల మద్దతు కాంగ్రెస్‌కే..

నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల్లో మాలల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందని మాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండమల్ల శంకరయ్య తెలిపారు. సోమవారం నల్లగొండలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేకల భద్రాద్రి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కంచి మధుసూదన్, మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ డీఈ సర్వయ్య, చింతమల్ల లింగమయ్య, ఎన్నమల్ల అనిల్, తెలగమళ్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

మర్రిగూడ : మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన గంట అంజయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 12 లీటర్ల క్వార్టర్ సీసాలను పట్టుకున్నట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు. అంజయ్యపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎన్నికల సిబ్బందికి 331 బస్సులు

- ఆరు డిపోల నుంచి బస్సుల ఏర్పాటు

నల్లగొండ రూరల్, మిర్యాలగూడ టౌన్: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది, ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు చేర్చేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందు కోసం ఎన్నికల అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 331 ఆర్టీసీ బస్సులను సమకూర్చారు. మధ్యలో ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే మరో బస్సును అందుబాటులో ఉంచేలా అదనంగా మరో 10 బస్సులను సిద్ధంగా ఉంచారు. పోలింగ్ సామగ్రి, ఎన్నికల సిబ్బందిని తరలించే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ ఎస్కార్ట్ ఉంటుంది.

జిల్లాల వారీగా బస్సుల వివరాలు..

నల్లగొండ జిల్లా నుంచి 142, సూర్యాపేట జిల్లా నుంచి 124, యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి 65

డిపోల వారీగా ఇలా..

నల్లగొండ ఆర్టీసీ డిపో నుంచి 55 బస్సులు, మిర్యాలగూడ డిపో నుంచి 34 బస్సులు, దేవరకొండ డిపో నుంచి 53, కోదాడ డిపో నుంచి 66, సూర్యాపేట డిపో నుంచి 58, యాదాద్రి భువనగిరి డిపో నుంచి 65 బస్సులు ఏర్పాటు చేశారు.



రెండు రోజులు తప్పని ఇబ్బందులు..

30వ తేదీన పోలింగ్ కావడంతో ఒక రోజు ముందుగానే పోలింగ్ సామగ్రి, ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలిస్తుండడంతో ఈ రెండు రోజులు ప్రయాణికులు కాస్త ఇబ్బందులు పడే అవకాశం ఉంది. అయితే ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఆర్టీసీ బస్సులను వినియోగిస్తున్నప్పటికీ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతాం. ఈ నెల 29, 30 తేదీల్లో ఆర్టీసీ సంస్థకు ప్రయాణికులు అన్నీ విధాలుగా సహకరించాలి.

– శ్రీదేవి, ఆర్టీసీ ఆర్‌ఎం, నల్లగొండ

జంగ్ తెలంగాణ

సొంతూళ్లోనే ఓటు వేసేందుకు అవకాశం

- మునుగోడు నియోజకవర్గంలో నూతనంగా 9 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

చండూరు: మునుగోడు నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు నూతనంగా 9 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. గట్టుప్పల్ మండలం శేరిగూడెంలో(పీఎస్ నం. 184), చండూరు మండలం పడమటి తాళ్ల గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో (పీఎస్ నం. 218), చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో(పీఎస్ నం. 31), చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో గురుకుల బాలికల పాఠశాలలో (పీఎస్ నం. 33), చౌటుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (పీఎస్ నం. 39), చౌటుప్పల్ మండలం చింతలగూడెం మండల ప్రాథమిక పాఠశాలలో (పీఎస్ నం. 51), నాంపల్లి మండలం షర్భానాపురం అంగన్‌వాడీ కేంద్రంలో (పీఎస్ నం. 289), నాంపల్లి మండలం సుంకిశాల మండల ప్రాథమిక పాఠశాలలో (పీఎస్ నం. 295), నాంపల్లి మండలం జాన్‌తండా (పీఎస్ నం. 264)లో నూతనంగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.


గట్టుప్పల్ మండలం శేరిగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్

బహుజన బిడ్డను గెలిపించుకోవాలి

- కేంద్ర సహాయ మంత్రి శోభ కరంద్లాజే

నల్లగొండ టూటౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉందని, రాష్ట్రంలో కూడా బీజేపీని గెలిపిస్తే డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి చేసుకోవచ్చని, నల్లగొండ నియోజకవర్గంలో ఉన్నత చదువులు చదువుకున్న బహుజన బిడ్డ మాదగాని శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపించుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభ కరంద్లాజే అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్, గాంధీనగర్, సావర్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్, పేదలకు ఇళ్ల పథకం అమలు చేయని కేసీఆర్ మనకు అవసరమా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్క కేసీఆర్ కుటుంబానికే లబ్ధి జరిగిందని, పేదలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. కేంద్రం ఇస్తున్న ఇళ్లను కూడా పేదలకు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం కేసీఆర్‌ది అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కుటుంబ పార్టీలని, వారికి పేదల సంక్షేమం పట్టదని, అన్ని వర్గాల సంక్షేమం ఒక్క బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని తెలిపారు. బహుజన బిడ్డ మాదగాని శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపించి నల్లగొండ గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించాలంటే అవినీతి రహిత ప్రభుత్వం రావాలని, అది బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి, బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, పోతెపాక సాంబయ్య, దాయం భూపాల్‌రెడ్డి, కంకణాల నాగిరెడ్డి, పెరికి మునికుమార్, దాసరి సాయి, చర్లపల్లి గణేష్, ఏరుకొండ హరి పాల్గొన్నారు.


నల్లగొండలో ప్రచారం చేస్తున్న శోభ కరంద్లాజే, చిత్రంలో బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్

గిరిజనులమంతా కేసీఆర్‌కు రుణపడి ఉంటాం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): గిరిజనులకు రాజ్యాధికారం కల్పించిన సీఎం కేసీఆర్‌కు గిరిజనులమంతా రుణపడి ఉన్నామని, నాగార్జునసాగర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్‌కే గిరిజనుల మద్దతు అని ఆలిండియా బంజారా సేవాసంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాణావత్ బాబురావు నాయక్ అన్నారు. నోముల భగత్‌కు మద్దతుగా సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూర్యభాషానాయక్, ఆలిండియా బంజారా సేవాసంఘ్ నియోజకవర్గ అధ్యక్షుడు భిక్షానాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ భగవాన్ నాయక్

ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలు చేస్తాం

- చెర్వుగట్టులో పూజలు చేసిన నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం
- ఆలయంలో బాండ్ పేపర్‌పై సంతకం

నార్కట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వరస్వామి సాక్షిగా ప్రమాణం చేశారు. సోమవారం ఆయన నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని బాండ్ పేపర్‌పై రాసి దేవుడి సాక్షిగా సంతకం చేసి ప్రమాణం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఏఐసీసీ ఇన్‌చార్జి ఫర్యాజ్, దైద రవీందర్, చాల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ జెడ్పీటీసీ అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నేతగాని కృష్ణ, రమేష్, రేగట్టె నవీన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, నర్సిరెడ్డి, జెర్రిపోతుల భారత్, సట్టు సత్తయ్య, రాదారపు భిక్షపతి, విజయలక్ష్మి, అచ్చాలు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.


చెర్వుగట్టు దేవాలయంలో బాండ్ పేపర్‌పై సంతకం చేస్తున్న వేముల వీరేశం

అర్వపల్లి దేవాలయంలో మందుల సామేల్ ప్రమాణం

అర్వపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో సోమవారం తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ బాండ్ పేపర్ రాసి ప్రమాణం చేశారు. టీపీసీసీ ఆదేశాల మేరకు బాండ్ పేపర్‌తో ఆయన ఆలయంలో పూజలు చేశారు. అనంతరం బాండ్ పేపర్‌ను చేతపట్టుకొని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానంద చారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, దండ వీరారెడ్డి, లూనావత్ స్వాతిరవీందర్‌నాయక్, చెంచల శ్రీనివాస్, దిర్శనపు కృష్ణమూర్తి, బైరబోయిన మహారాజు తదితరులు పాల్గొన్నారు.


అర్వపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బాండ్ పేపర్ రాసిన మందుల సామేల్

కార్మికులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

- మిర్యాలగూడ బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులకు అండగా ఉంటుందని మిర్యాలగూడ బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని రైల్వే ట్రాక్ సమీపంలోని లారీ అసోయేషన్ వద్ద యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు చాంద్‌పాషా, ప్రధాన కార్యదర్శి రవీంద్రరావు, కోశాధికారి రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వాగ్దానాలు బూటకం

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల వాగ్దానాలు బూటకమని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు బూటకపు వాగ్దానాలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం భాస్కర్‌రావు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల లబ్ధిదారులందరికీ తన సంతకంతో కూడిన లెటర్లను ప్రతి ఇంటికి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పెద్ది శ్రీనివాస్‌గౌడ్, కుర్ర విష్ణు, మట్టపల్లి సైదులుయాదవ్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

గ్రామ స్థాయిలో బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాడుగులపల్లి మండలంలోని తోపుచర్ల, సీత్యాతండా గ్రామాలకు చెందిన ఎర్రెడ్ల సతీశ్‌రెడ్డి, బాణావత్ కృష్ణ, గున్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, చిట్టెపు భరత్‌రెడ్డి, నారాయణరెడ్డితో సహా 30 మంది సీపీఎం, కాంగ్రెస్ పార్టీలకు రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ పోకల శ్రీవిద్యరాజు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, మండల పార్టీ అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య తదితరులు ఉన్నారు.


మిర్యాలగూడ: మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు

మరోసారి భాస్కర్‌రావును గెలిపించండి..

మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన నల్లమోతు భాస్కర్‌రావును మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్‌ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడెం, భాగ్యనగర్ కాలనీ ప్రాంతాల్లో స్థానిక కౌన్సిలర్ తిరుమలగిరి స్వర్ణలతవజ్రం, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా భాస్కర్‌రావు సతీమణి జయ పట్టణంలోని 46వ వార్డు పరిధి కలాల్‌వాడ, మెయిన్ బజార్, తదితర ప్రాంతాల్లో స్థానిక కౌన్సిలర్ సలీంతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి భాస్కర్‌రావును గెలిపించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

మాడుగులపల్లి: మండలంలోని తోపుచర్ల, సీత్యాతండా గ్రామాలకు చెందిన పలువురు సోమవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నిమ్మల నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో భాస్కర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, బీఆర్‌ఎస్ నాయకులు పోకల రాజు, కనకారెడ్డి, పాల్గొన్నారు.


మిర్యాలగూడ: కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నల్లమోతు భాస్కర్‌రావు

ప్రాజెక్టులకు కేంద్ర నిధులు మంజూరు చేయిస్తా

- మునుగోడు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి

మునుగోడు: పెండింగ్‌లో ఉన్న చర్లగూడెం, కిష్టరాయినిపల్లి రిజర్వాయర్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయించి మునుగోడుకు సాగు నీరు అందిస్తానని మునుగోడు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మునుగోడు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితం మొదలుపెట్టిన ప్రాజెక్టుల నిర్మాణ పనులు స్థానిక ఎమ్మెల్యే అసమర్థత వల్ల పూర్తిచేయలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే భూ కబ్జాలు చేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. స్వలాభం కోసం పూటకో పార్టీ మారుతున్న కాంగ్రెస్ అభ్యర్థికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేగా పదవులు అనుభవించాడు తప్ప నియోజకవర్గాన్ని ఎక్కడా అభివృద్ధి చేయలేదన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న తనను ఆదరించి నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ఓట్లువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వేదాంతం గోపీనాథ్, బొడిగే అశోక్‌గౌడ్, బొడ్డు నాగరాజుగౌడ్, సురిగి నర్సింహగౌడ్, పందుల నర్సింహ, జిట్టగోని కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మునుగోడు : రోడ్ షోలో మాట్లాడుతున్న చలమల్ల కృష్ణారెడ్డి

బీజేపీతోనే సామాజిక న్యాయం

చండూరు: బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధ్యమవుతుందని మునుగోడు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి చలమల కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం చండూర్ మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. కోమటి వీరేశం, వెంకట్‌గౌడ్, పాలకూరి నాగరాజు, ఆవుల అశోక్, చిలుకూరు అశోక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జోష్ నింపిన ప్రియాంక


భువనగిరిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ప్రియాంక గాంధీ, పక్కన మాణిక్‌రావ్ ఠాక్రే, భువనగిరి అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


అభివాదం చేస్తున్న ప్రియాంక గాంధీ

చెర్వుగట్టుకు పోటెత్తిన భక్తజనం

నార్కట్‌పల్లి: కార్తీక పౌర్ణమి సందర్భంగా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. దైవ దర్శనానికి దాదాపు గంట సమయం పట్టిందని భక్తులు పేర్కొన్నారు. భక్తుల తాకిడి కారణంగా పోలీసులు గట్టు పైకి వాహనాలు వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదు. భక్తుల కోసం నూతనంగా లడ్డూ ప్రసాదం విక్రయ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు.

సినీ హాస్యనటుడు శ్రీనివాస్‌రెడ్డి పూజలు..

ప్రముఖ సినీ హాస్యనటుడు శ్రీనివాస్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి సోమవారం చెర్వుగట్టు క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆయనకు దేవాలయ అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, దేవాలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సీనియర్ అసిస్టెంట్లు ఇంద్రసేనారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, వంశీ, అర్చకులు శ్రీకాంత్, సురేష్, సతీష్, నాగయ్య తదితరులు ఉన్నారు.


రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న సినీ హాస్యనటుడు శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

- తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్

శాలిగౌరారం: కాంగ్రెస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి ప్రజా సంక్షేమం సాధ్యమని తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండలంలోని బండమీదిగూడెం, ఊట్కూరు, పెర్కకొండారం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. అధికార పార్టీ నేతలు తుంగతుర్తి నియోజకవర్గంలో మూసీనదిలోని ఇసుకను పూర్తిగా కొల్లగొట్టి వేలకోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పి సాగనంపాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక..

బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఊట్కూరు ఎంపీటీసీ యానాల లింగారెడ్డితో పాటూ పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు సామేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాళ సమరంరెడ్డి, ఎన్నికల నిర్వాహణ మండల అధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, కుర్ర లింగయ్య, శ్రీను, పల్స సైదులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయం

తెలంగాణలో ఈసారి కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఏఐసీసీ అధికార ప్రతినిధి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ నియంత పాలన పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇసుక మాఫియాను అరికట్టేందుకు ప్రజలు ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు కోసం కృషి చేయాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, చాడ సురేశ్‌రెడ్డి, గోదల నరేందర్‌రెడ్డి, యుగంధర్, ఇటికాల చిరంజీవి, మండల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


బండమీదిగూడెంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మందుల సామేల్

అదుపుతప్పి ఆటో బోల్తా.. ఒకరి మృతి

మిర్యాలగూడ టౌన్ : ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీకి చెందిన బొడ్డ కృష్ణమూర్తి (50) అపరాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కృష్ణమూర్తి వ్యాపార పని నిమిత్తం సోమవారం నేరేడుచర్ల నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న ఆటో ఎక్కాడు. మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామ శివారులోకి ఆటో రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కృష్ణమూర్తి కోదాడ–జడ్చర్ల రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ప్రయాణికుడు మేడిపల్లి కృష్ణయ్యకు తీవ్ర గాయాలు కాగా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం కృష్ణమూర్తి మృతదేహాన్ని కూడా ఆస్పత్రికి తీసుకెళ్లారు.మృతుడి కుమారుడు శ్రీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపారు.